
సాక్షి
బాపట్ల
గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



45.562 టీఎంసీలు నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 35,643 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 45.562 టీఎంసీలు నిల్వ ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4012 క్యూసెక్కులు విడుదల చేశారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు

రొంపిచర్ల: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రొంపిచర్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 355 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

30 వరకు ఈ-కేవైసీ గడువు పెంపు

కొరిటెపాడు(గుంటూరు): రైతులు తమ పంట వివరాలను ఈ-క్రాప్‌లో భాగంగా ఈ-కేవైసీ చేయించుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. గుంటూరు జిల్లాలో 1,87,284 ఎకరాల్లో ఈ-కేవైసీ పూర్తి చేశామన్నారు. మరో 27,168 ఎకరాలకు రైతులు చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొడాలి ప్రతాప్ కుమార్, సంధ్యారాణి దంపతులు వారి కుమారుడు షణ్ముఖ గణేష్ పేరిట రూ.లక్ష విరాళం ఇచ్చారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆలయ ఏసీ శ్రీరామ వరప్రసాద రావుకు ఈ మొత్తాన్ని అందించారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో అధికారులు సత్కరించారు. ఆలయ అధికారి బర్మా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గుంటూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ (డీసీ)గా కె.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌వీవీఎన్ బాబ్జీ రావును విజయనగరం డీసీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో సెబ్ హెడ్ క్వార్టర్స్‌లో డీసీ(ట్రైనింగ్)లో ఉన్న కె.శ్రీనివాసులను గుంటూరుకు బదిలీ చేశారు. కాగా, మన్యం జిల్లాలో సెబ్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ)గా పనిచేస్తున్న ఎం.రవికుమార్‌రెడ్డిని అదే హోదాలో గుంటూరుకు, బాపట్ల డీపీఈఓగా పనిచేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఈఎస్) ఎ.అరుణకుమారిని గుంటూరు ఈఎస్‌గా బదిలీ చేశారు.

29 నుంచి శివాలయంలో పవిత్రోత్సవాలు


పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 29వ తేదీ నుంచి అక్టోబరు 1వ తేదీ వరకూ పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ బుధవారం తెలిపారు. పెదకాకాని శివాలయంలో పవిత్రోత్సవాలను పురస్కరించుకుని మూడు రోజుల పాటు రాహుకేతు పూజలు, అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు వెల్లడించారు. అక్టోబరు 2వ తేదీన అమావాస్యను పురస్కరించుకుని రాహుకేతు పూజలతోపాటు ఇతర అన్ని కార్యక్రమాలు యథావిధిగా జరుగుతాయని వివరించారు.

యార్డుకు 53,149 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు బుధవారం 53,149 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 51,039 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.9,000 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,000 నుంచి రూ.18,700 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 26,374 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

బీపీటీకి దేశవ్యాప్త ప్రాధాన్యం



- బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానంలో విత్తనాలు ఉత్పత్తి
- బ్రీడర్ సీడ్‌తోపాటు ఫౌండేషన్ సీడ్ ఇక్కడే ఉత్పత్తి
- బ్రీడర్ సీడ్ కంపెనీలకు, ఫౌండేషన్ సీడ్ రైతులకు
- బీపీటీ 5204కు డిమాండ్
- బ్రీడర్‌సీడ్‌గా పది రకాలు ఉత్పత్తి చేస్తున్న వ్యవసాయ పరిశోధనా స్థానం
- ఫౌండేషన్ సీడ్‌గా నాలుగు రకాలు ఉత్పత్తి చేస్తున్న వ్యవసాయ కళాశాల క్షేత్రం
- 124 ఎకరాల్లో సీడ్ ఉత్పత్తి కోసం వేగంగా వరినాట్లు
- మే నాటికి అందుబాటులోకి 2 వేల క్వింటాళ్ల వరి వంగడాలు
- బీపీటీ రకాలకు ఆంధ్ర, తెలంగాణలతో పాటు ఉత్తరాది రాష్ట్రాల్లోనూ డిమాండ్

మనది ప్రధానంగా వ్యవసాయాధారిత దేశం. దేశ జీడీపీలో వ్యవసాయ రంగానిదే అగ్రస్థానం. దక్షిణ భారతంలో వరి ముఖ్యమైన ఆహారంగా ఉంటుండగా, ఉత్తరాదిలో సైతం గోధుమ తర్వాత చెప్పుకోదగ్గ స్థాయిలోనే వరిని పండిస్తుంటారు. చీడపీడలను తట్టుకుని, బలవర్ధకమైన వరిని ప్రజలకు అందించేందుకు బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం నిరంతరం శ్రమిస్తోంది. ఇక్కడ ఉత్పత్తి చేసిన బీపీటీ వరి విత్తనాలకు దేశవ్యాప్తంగా ప్రా'ధాన్యం' ఉంది. బీపీటీ 5204 రకంతోపాటు ఇక్కడే ఉత్పత్తి చేసిన పదిరకాల వరి విత్తనాలను మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల రైతులు సైతం అమితాసక్తితో సాగు చేస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, పంజాబ్ వంటి పెద్ద రాష్ట్రాల్లో లక్షల హెక్టార్లలో బాపట్ల వంగడాలను సాగుచేయడమే దీనికి నిదర్శనం. దీంతో బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం దేశవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు అందుకుంటోంది.

బాపట్ల వంగడాలను 'వరి'ంచిన అదృష్టం



బాపట్ల వ్యవసాయ కళాక్షేత్రం



బాపట్ల వ్యవసాయ కళాక్షేత్రంలో వరినాట్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఉత్పత్తి చేసిన బీపీటీ వరి విత్తనాలకు దేశ వ్యాప్తంగా డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో ఇక్కడ పెద్దఎత్తున వరి విత్తనాల ఉత్పత్తి సాగుతోంది. బాపట్లలో ఉత్పత్తి చేసిన బీపీటీ 5204 రకంతో పాటు ఇక్కడే ఉత్పత్తి చేసిన పదిరకాల వరి విత్తనాలను మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల రైతులు సాగు చేస్తున్నారు. దీంతో బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం దేశవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు అందుకుంటోంది.

బీపీటీ 5204కు ఎందుకింత డిమాండ్?

1986లో బాపట్లలో ఉత్పత్తి చేసిన బీపీటీ 5204 రకం వరి పంట కాలం 140 నుంచి 145 రోజులు కాగా బియ్యం తెలుపు రంగులో సన్నగా ఉండి అన్నానికి అనుకూలంగా ఉంటుంది. 1000 గింజల బరువు 14.5 గ్రాములు ఉండి అధిక దిగుబడినిస్తుంది. వినియోగ దారులు ఇష్టపడే ఈ రకానికి డిమాండ్ అధికం. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 20 లక్షల హెక్టార్లలో రైతులు ఈ రకాన్ని సాగుచేస్తున్నారు. దీంతోపాటు బాపట్లలో తయారు చేసిన బీపీటీ 2782, 2595, 2270, 2295, 2231, 3291, 2846, 2841, 3082,2411 రకాల వరి విత్తనాలకు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం లభించింది. పైరకాల వరిలో దిగుబడులు అధికంగా ఉండడంతో రైతులు వీటిని సాగు చేసేందుకు మొగ్గుతున్నారు.

వారంలోపు నాట్లు పూర్తి...

ఈ ఏడాది 11 బీపీటీ రకాల విత్తనాలను 21 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గత నెలరోజుల నుంచి వ్యవసాయ పరిశోధనా స్థానంలోని పొలాల్లో పై రకాలకు చెందిన వరి నాట్లు వేస్తున్నారు. వారంలోపు మొత్తం నాట్లు పూర్తి కానున్నాయి. మే నెల చివరినాటికి వరి హార్వెస్టింగ్‌కు రానుంది. ప్రాసెసింగ్ అనంతరం సర్టిఫై చేసి బ్రీడర్ వరివిత్తనాలను ఏపీ సీడ్స్‌తోపాటు పలు ప్రైవేటు కంపెనీలకు అందించనున్నారు. దీంతోపాటు వ్యవసాయ పరిశోధనా స్థానం బీపీటీ 2846, 2595 రకాల ఫౌండేషన్ సీడ్‌ను రైతులకు చెందిన 11 ఎకరాల్లో ఉత్పత్తి చేసి విత్తనాలను జిల్లా రైతులకు పంపిణీ చేయనున్నారు. మరో వైపు బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రంలో ఫౌండేషన్ సీడ్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసి రైతులకు విత్తనాల కింద అందించనున్నారు. ఇందుకోసం బీపీటీ 5204, 2782, 2595, 2270 రకాల విత్తనాలను 103 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరినాట్లు పూర్తయ్యాయి. మే నెల నాటికి వరి కోతలు పూర్తిచేసి ప్రాసెసింగ్ అనంతరం సర్టిఫై చేసి సీడ్‌ను రైతులకు అందించనున్నారు. ఈ ఏడాది సుమారు 1600 క్వింటాళ్ల విత్తనాలను ఇక్కడ ఉత్పత్తి చేస్తున్నారు.

రైతులకు సరఫరా..

నేషనల్ సీడ్ కార్పొరేషన్ బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఉత్పత్తి చేసిన బ్రీడర్ సీడ్‌ను తీసుకొని ఫౌండేషన్ సీడ్‌గా పునరుత్పత్తి చేసి దేశవ్యాప్తంగా పెద్దఎత్తున రైతులకు అందజేస్తోంది. మరోవైపు ఏపీ సీడ్స్‌తో పాటు పలు ప్రైవేట్ సీడ్ కంపెనీలు ఇక్కడి బ్రీడర్‌సీడ్ కొనుగోలు చేసి ఫౌండేషన్ సీడ్‌గా మార్చి రెండు తెలుగు రాష్ట్రాల రైతులకు అందిస్తున్నారు. ప్రతి ఏటా ఇక్కడి వ్యవసాయ క్షేత్రంలో 20 నుంచి 25 ఎకరాల్లో 400 క్వింటాళ్లకు పైగా బ్రీడర్ సీడ్‌ను ఉత్పత్తి చేసి ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల ద్వారా రైతులకు సరఫరా చేస్తున్నారు.



బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం

దేశ వ్యాప్తంగా రైతులకు బీపీటీ విత్తనాలు



బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఇప్పటివరకు 15 రకాల వరి వంగడాలను ఉత్పత్తి చేశాం. వీటిలో బీపీటీ 5204 అత్యంత ప్రాచుర్యం పొందింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఈరకం వరిని రైతులు సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా ఇక్కడ బ్రీడర్ సీడ్‌ను ఉత్పత్తిచేసి ప్రభుత్వ, ప్రైవేటు సీడ్ కంపెనీలకు ఇస్తున్నాం. వారు బ్రీడర్‌ను ఫౌండేషన్ సీడ్‌గా మార్చి దేశంలోని పలు రాష్ట్రాల రైతులకు అందిస్తున్నారు. ఈ ఏడాది 21 ఎకరాల్లో 11 రకాల బీపీటీ వరి విత్తనాలను బ్రీడర్ సీడ్‌గా ఉత్పత్తి చేస్తున్నాం. సుమారు 400 క్వింటాళ్ల విత్తనాలను ఉత్పత్తి చేసి మే నెలలో ప్రభుత్వంతోపాటు ప్రైవేటు కంపెనీలకు సరఫరా చేస్తాం.

– కృష్ణవేణి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్, వ్యవసాయ పరిశోధనా స్థానం, బాపట్ల

రైతుల కోసం ఫౌండేషన్ సీడ్ ఉత్పత్తి



బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రం పరిధిలో 103 ఎకరాల్లో బీపీటీ 5204, 2782, 2595, 2270 నాలుగు రకాల వరి విత్తనాలను ఫౌండేషన్ సీడ్‌గా సాగు చేస్తున్నాం. ప్రస్తుతం వరినాట్లు పూర్తయ్యాయి. మే నెల నాటికి హార్వెస్టింగ్ చేస్తాం. అనంతరం ప్రాసెసింగ్ చేసి సర్టిఫికేషన్ అనంతరం విత్తనాలను రైతులకు అందిస్తాం. సుమారు 1600 క్వింటాళ్ల విత్తనాలను వచ్చే సీజన్‌కు రైతులకు అందించాలన్నది లక్ష్యం. రాష్ట్ర వ్యాప్తంగా అవకాశమున్న మేర వరి విత్తనాలను పంపిణీ చేస్తాం. ప్రతిఏటా ఇక్కడ వరి విత్తనాలను ఉత్పత్తిచేసి రైతులకు అందిస్తున్నాం.

– అరుణ, సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్, వ్యవసాయకళాశాల క్షేత్రం, బాపట్ల

నిండా మునిగినా..
'నిమ్మ'కు పరిహారం లేదు!

పంట నష్టం వివరాల నమోదులో నిమ్మను పరిగణనలోకి తీసుకోవటం లేదు. ఉద్యాన అధికారులు కనీసం అటువైపు కూడా చూడటం లేదు. భారీ వర్షాలు, వరదలకు నిమ్మ తోటల్లో అయిదారు అడుగుల మేర నీరు రోజుల తరబడి నిలిచింది. దీంతో వేళ్లు కుళ్లిపోయి క్రమంగా చెట్టు చనిపోతుందని రైతులు చెబుతున్నారు. భూమి స్వభావం కూడా మారే అవకాశం ఉందని, శాస్త్రవేత్తలు పరిశీలించి తగు సూచనలు చేయాలని కోరారు. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణతో రైతులు

- పంట నష్టం జాబితాలో దక్కని చోటు
- తహసీల్దార్‌ను కలిసిన బాధిత రైతులు
- జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని హామీ
- కొన్నిచోట్ల అరటి తోటలకూ ఇదే దుస్థితి

తెనాలి: జూలై నెలలో, గత నెల 31, సెప్టెంబరు ఒకటో తేదీన కురిసిన భారీ వర్షాలకు తోడు వరద పోటెత్తడంతో నిమ్మ తోటల్లో అసాధారణమైన రీతిలో నీరు నిలిచింది. కాజ టోల్‌గేట్, ఆ పరిసరాల్లోని వరద నీరు దిగువకు ప్రవహించింది. గుంటూరు నల్ల, తుంగభద్ర డ్రెయిన్లకు వరద పోటెత్తింది. దీంతో తెనాలి నియోజకవర్గంలోని సంగంజాగర్లమూడి, అంగలకుదురు, వేమూరు నియోజకవర్గంలోని దుండిపాలెం, యడ్లపల్లి, వలివేరు, చుండూరు, మోదుకూరు పరిధిలోని పంట చేలను ముంచెత్తింది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో సాగు చేసే నిమ్మ తోటల్లోనూ వరద నీరు చేరింది. 7-8 అడుగుల ఎత్తులో ఉండే నిమ్మతోటల్లో 4-6 అడుగుల మేర ముంపు తప్పలేదు. ఈ నెల 10వ తేదీ వరకూ పూర్తిస్థాయిలో నీరు బయటకు వెళ్లనేలేదు.

అటువైపు చూసిన వారే లేరు..

ఈ పరిణామం నిమ్మ రైతులను కలవరపెట్టింది. తోటల్లో నీరు ఎక్కువ రోజులు నిలిచి ఉండటం గత నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేదు. దీంతో మొక్కలకు నష్టం జరుగుతోంది. పెద్ద తోటల్లో కొత్త చిగురు రాకుండా తెగుళ్లు ఆశిస్తూ, క్రమంగా చెట్టు ఎండిపోతోందని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో నిమ్మ చెట్టు 15-20 ఏళ్ల వరకు కాపునిస్తుంది. అలాంటి చెట్టు చనిపోతే మళ్లీ కొత్త మొక్క నాటి, అది పెరిగి, దిగుబడి రావటానికి అయిదేళ్లు పడుతుందని తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యాన అధికారులు, సంబంధిత శాస్త్రవేత్తలు నిమ్మ తోటలను పరిశీలించి, తగిన సూచనలు చేయాలని రైతులు కోరారు. ఆ పరిశీలన సంగతి అటుంచితే.. ఇప్పటి వరకు నిమ్మతోటలకేసి ఎవరూ రానే లేదని వారు వాపోతున్నారు.

నిమ్మ, అరటి తోటలకు పరిహారమేదీ?

పంట నష్టం నమోదులో నిమ్మ తోటలను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. అదేమంటే ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో తగిన ఆదేశాలు లేవని అధికారులు చెబుతున్నారని తెలిపారు. దీనితోపాటు కొల్లిపర మండలంలోని కొన్ని గ్రామాల్లో వరద నీటిలో రోజుల తరబడి ఉన్న అరటి తోటలను కూడా పంట నష్టంలో పరిగణనలోకి తీసుకోవటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యలో బుధవారం పలువురు రైతులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి నేతృత్వంలో తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను కలిశారు. రైతుల ఆవేదనను విన్న తహసీల్దార్.. ఫోన్‌లో ఉద్యాన అధికారితో మాట్లాడారు. తెనాలి మండలం అంగలకుదురు, సంగంజాగర్లమూడి గ్రామాల్లో నిమ్మ, అరటి పంటల నష్టాన్ని ఎందుకు నమోదు చేయటం లేదని ప్రశ్నించారు. అందుకు తగిన ఉత్తర్వులు లేవని వారు సమాధానమిచ్చారు. దీంతో సమస్యను జిల్లా కలెక్టర్, ఉద్యానశాఖ అధికారి దృష్టికి తీసుకెళతానని తహసీల్దార్ సదరు రైతులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రూ.10 వేలు, రూ.14 వేలు ఏమాత్రం సరిపోవని రైతులు వెలగా ఆదినారాయణ, పాపోపలు శ్రీనివాసరావు చెప్పారు. పరిహారం ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఇవ్వాలని కోరారు.



ఇటీవల వచ్చిన వరదతో ముంపునకు గురైన నిమ్మతోట

కూటమిలో కుంపటి

నామినేటెడ్ పదవులు దక్కక టీడీపీ నేతల అసంతృప్తి

- మూడు నెలలుగా పదవుల కోసం ఎదురు చూపులు
- ప్రతి నియోజకవర్గం నుంచి వంద వినతులు
- జిల్లాకు ఒక్క పదవీరాని వైనం
- జనసేన నేతల్లోనూ నిరాశ
- బీజేపీ నేతల ఊసే కరువు
- మూడు పార్టీల్లో అసంతృప్తులు



సాక్షి ప్రతినిధి,బాపట్ల: నామినేటెడ్ పదవులు దక్కకపోవడంతో కూటమి పార్టీల్లోని ఆశావహులు తలలు పట్టుకున్నారు. ఇన్నాళ్లుగా ఎదురు చూపులు చూసినా పదవులు వరించకపోవడంతో సీనియర్ నేతలు అసంతృప్తితో రగిలి పోతున్నారు. కొందరు అధిష్టానాలపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. పదవులు దక్కని నేతల అనుచరులు అధిష్టానాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పచ్చపార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

జిల్లాలో ఒక్కరూ లేరా..?

ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు చెందిన ఒక్క పేరు కనిపించలేదు. టీడీపీతోపాటు బీజేపీ, జనసేన నేతలకు పెద్ద ఎత్తున పదవులు లభించనున్నాయని అన్ని పార్టీల నేతలు ఆశల పల్లకీలో ఊయలలూగారు. తొలి జాబితాలో జిల్లాకు చెందిన పలువురు నాయకులకు పదవులు దక్కనున్నాయని పచ్చపార్టీ నేతలు భావించగా 25 శాతం వాటాతో మరిన్ని పదవులు లభిస్తాయని జనసేన నేతలు సంబరపడ్డారు. తమకు రావాల్సిన పదిశాతం వాటాలో మరిన్ని పదవులు లభించనున్నాయని బీజేపీ నేతలు ఆశించారు. తీరా చూస్తే జిల్లాకు ఒక్కటంటే ఒక్క నామినేటెడ్ పదవి దక్కలేదు. చీరాలకు చెందిన పిల్లి మాణిక్యరావుకు లెదర్ కార్పొరేషన్ చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఆయన దశాబ్దాల క్రితమే గుంటూరులో సెటిలయ్యారు. ఈ లెక్కన ఆయన జిల్లా కోటాలో లేనట్లే.

జాబితా చాంతాడంత..

జిల్లాకు సంబంధించి రాష్ట్రస్థాయి పదవులున్న పచ్చనేతలు చాలామంది ఉన్నారు. టీడీపీ రాష్ట్రనేత తాతా జయప్రకాశ్‌నారాయణ, బాపట్ల మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, రాష్ట్ర మహిళానేత మానం విజేత, తెలుగురైతు నేత పమిడి భాస్కర్ రావు, చీరాల నుంచి సజ్జాహేమలత, వేమూరు నియోజకవర్గం నుంచి మైనేని మురళీకృష్ణతో పాటు పలువురు నేతలు నామినేటెడ్ పదవులు ఆశించారు. జనసేన నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మత్తి భాస్కర్‌రావు, బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి శివన్నారాయణతోపాటు మరికొందరు నేతలు పదవులు ఆశించారు. శివన్నారాయణకు బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ పదవి లభించనుందని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. బీజేపీ కోటాలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్‌కు సైతం కీలక పదవి లభిస్తుందని అందరూ భావించారు. తీరా చూస్తే మూడు పార్టీల్లో ఒక్కరికీ నామినేటెడ్ పదవి దక్కలేదు. దీంతో ఆయా పార్టీల నేతల అనుచరులు, అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తమ నాయకులకు పదవులు దక్కకపోవడంపై చాలామంది కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా నామినేటెడ్ పదవుల పంపిణీ వ్యవహారంలో కూటమి పార్టీల్లో కుంపటి రాజేసినట్లే కనపడుతోంది.

ఒక్కో నియోజకవర్గం నుంచి వంద వినతులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్దఎత్తున నామినేటెడ్ పదవుల పంపకం ఉంటుందని ప్రచారం జరిగింది. పదవుల కోసం ఒక్కో నియోజకవర్గం నుంచి వంద పేర్లు పంపాలని టీడీపీ అధిష్టానం సూచించడంతో ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ అబ్జర్వర్లు, జిల్లా అబ్జర్వర్లు నాయకుల జాబితాలు పంపారు. కూటమిలోని జనసేన, బీజేపీ నేతలు సైతం తమ జాబితాలను అధిష్టానానికి చేర్చారు. తొలి నెలలోనే జాబితాలు సమర్పించగా పదవుల పంపిణీ తంతు ఆలస్యమైంది. పదవుల పంపకాల్లో కూటమి పార్టీల మధ్య స్పష్టత రాలేదని ప్రచారం జరిగింది. ఎట్టకేలకు మంగళవారం 20 కార్పొరేషన్ పదవులతోపాటు కొన్ని కార్పొరేషన్ల పరిధిలో సభ్యుల జాబితాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ జాబితాలో బాపట్ల జిల్లాకు సంబంధించిన ఒక్క నాయకుడి పేరుకూడా కానరాలేదు.

పర్చూరు సీహెచ్‌సీకి అరుదైన గౌరవం

- ఆసుపత్రిలో అందుతున్న సేవలకు ప్రత్యేక హోదా
- ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయనున్న కేంద్రం
- జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు



పర్చూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్

పర్చూరు(చినగంజాం): పర్చూరు ప్రభుత్వ వైద్యశాల (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)కు అరుదైన గౌరవం లభించింది. ప్రజలకు ఉత్తమ సేవలందించడంలో సీహెచ్‌సీ అగ్రభాగాన నిలిచి ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. నేషనల్ హెల్త్ సిస్టం రీసెర్చ్ సెంటర్ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, నేషనల్ క్వాలిటీ ఆఫ్ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్‌ల ఆధ్వర్యంలో పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో సెప్టెంబరు 9,10 తేదీలలో రెండురోజులపాటు సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 83.47 శాతం స్కోర్ సాధించి జాతీయ స్థాయిలో నిలిచింది. బాపట్ల జిల్లాలోనే అరుదైన అవకాశాన్ని పర్చూరు సీహెచ్‌సీ దక్కించుకుంది. ప్రధానంగా ఎమర్జెన్సీ, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్, ల్యాబ్, ఫార్మసీ, క్లీన్ అండ్ గ్రీన్, ఆపరేషన్ థియేటర్ సేవలు, యాక్సిడెంట్ కేసుల సేవలలో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రత్యేక గుర్తింపు సాధించిన సీహెచ్‌సీ అభివృద్ధికి కేంద్రం ప్రత్యేకంగా నిధులు అందజేయనుంది.

మినీ లారీ, కరెంటు స్తంభాన్ని ఢీకొట్టిన కారు



కొల్లూరు : అతి వేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి మినీ లారీ, కరెంటు స్తంభాన్ని ఢీకొట్టిన సంఘటన మండలంలోని దోనేపూడిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రేపల్లె నుంచి కొల్లూరు వైపు వేగంగా ప్రయాణిస్తున్న కారు, చిన్న మలుపు లాంటి ప్రాంతంలో రోడ్డుపై వెనుకకు తిప్పుతున్న మినీ లారీని ఢీకొట్టింది. ప్రమాదాన్ని తప్పించేందుకు కారును నడుపుతున్న వ్యక్తి ప్రయత్నించడంతో అదుపు కోల్పోయి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. విద్యుత్తు తీగలు తెగిపడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వ్యాన్ డ్రైవర్‌తో పాటు, కారులోని వ్యక్తులు గాయాలపైనట్లు స్థానికులు వెల్లడించారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

కొల్లూరు : ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి పోలీసు, రెవెన్యూ, మైనింగ్ శాఖలు సంయుక్తంగా కఠిన చర్యలు చేపట్టేందుకు సన్నద్ధమయ్యాయని వేమూరు సీఐ పి.వి. ఆంజేయులు హెచ్చరించారు. కొల్లూరు పోలీసు స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని గ్రామాల నుంచి నదిలోకి వాహనాలు దింపి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖలతో కలసి సంయుక్తంగా ఏడు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే కొల్లూరులో తొమ్మిది కేసులు నమోదు చేసి, 27 ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. భట్టిప్రోలు పీఎస్ పరిధిలో ఐదు ట్రాక్టర్లు, లారీని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీ వర్గీయులపై కేసులు నమోదు

అద్దంకి రూరల్: పదిరోజుల కిందట మండలంలోని టీడీపీ నాయకులు వినాయక నిమజ్జనం సందర్భంగా ధర్మవరం గ్రామంలోని వైఎస్సార్ సీపీ వినాయక మందిరం వద్దకు రాగానే బాణాసంచా అధికంగా కాల్చటమే కాకుండా వారితో ఘర్షణకు దిగి గాయపర్చారు. అదే రోజు అర్ధరాత్రి వైఎస్సార్ సీపీ నాయకుడు అవిశెన ప్రభాకర రెడ్డి పెట్రోలు బంకును కాల్చి ధ్వంసం చేశారు. మరుసటి రోజు ట్రక్కులను తగల బెట్టి ఆస్తులను తీవ్రంగా నష్టపరిచారు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీ నాయకులు గాయాలపాలైన వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఘర్షణ నేపథ్యంలో దాడిచేసిన వారిని వదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరుగురిపై బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ తెలిపారు. దాడికి కారకులైన టీడీపీ నాయకులపై ఎటువంటి కేసులు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

2న హిందీ ప్రచార గురుపీఠ పురస్కారాలు ప్రదానం

తెనాలి: గాంధీ జయంతి, బోయపాటి నాగశ్వరరావు- సుభద్రాదేవి గురు దంపతుల 22వ వార్షిక హిందీ ప్రచార గురుపీఠ పురస్కార ప్రదాన వేడుక అక్టోబరు 2న నిర్వహించనున్నారు. దీనికి స్థానిక నాజరుపేటలోని హిందీ ప్రేమీమండలి మహావిద్యాలయం వేదిక కానుంది. మహావిద్యాలయం అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహిస్తారు. విజయవాడలోని దక్షిణ భారత హిందీ ప్రచారసభ స్నాతకోత్తర కళాశాల, ఏలూరులోని సర్ సీఆర్ రెడ్డి కళాశాల హిందీ విభాగం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ మోహన్‌రావు కొల్లి, విశాఖపట్నంలోని నేవీ చిల్డ్రన్ స్కూల్ సీనియర్ హిందీ అధ్యాపకురాలు డాక్టర్ నిర్మలాదేవి చిట్టిళ్లకు గురుపీఠ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

రేపు గ్రహణమొర్రి ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రహణమొర్రితో బాధపడుతున్న వారికి ఈ నెల 27న ఉచిత స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల నుంచి 50 ఏళ్ల వరకు వయస్సున్న గ్రహణమొర్రి బాధితులు 27న ఉదయం 10 గంటలకు గుంటూరు బ్రాడీపేట 2/13లోని శారదా నికేతన్ ప్రాంగణంలో ఉన్న భవిత కేంద్రంలో హాజరు కావాలని సూచించారు. హైదరాబాద్‌లోని బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రి, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో ఈ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99890 85102 ఫోను నెంబర్లో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

పట్నంబజారు: జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం గుంటూరు లోని లాలాపేట, ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలోని పట్నంబజారు రోడ్డులో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విజయదశమి పండుగ రానున్న సందర్భంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా తీసుకున్న చర్యలు చూసి అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.

పోలీసు జాగిలం 'ఫాక్సీ' మృతి

- సంతాపం వ్యక్తం చేసిన జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించిన జిల్లా పోలీసులు



పోలీసు జాగిలం మృతికి సంతాపం తెలుపుతున్న ఎస్పీ

బాపట్ల: బాపట్ల జిల్లా పోలీసు భద్రతా విభాగంలో 2022 నుంచి విశేష సేవలు అందించిన పోలీసు ట్రాకర్ జాగిలం 'ఫాక్సీ' (5.3 సంవత్సాలు) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం డాగ్ కెన్నెల్ భవనం వద్ద ఉంచి 'ఫాక్సీ'కి ఎస్పీ పూలమాల వేశారు. గౌరవ వందనం సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. పోలీసు లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియల నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ 'ట్రాకర్' విభాగంలో రెండు సంవత్సరాల పాటు ఎనలేని సేవలు అందించిన 'ఫాక్సీ' అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరంగా ఉందని తెలిపారు. పోలీస్ కుటుంబ సభ్యులలో ఒకరిగా భావించామని చెప్పారు. అనేక నేరాలు ఛేదించడంలో చురుగ్గా, సమర్థంగా పని చేసిందని చెప్పారు. డాబర్ మెన్ ఆడ జాతికి చెందిన 'ఫాక్సీ' ఎనిమిది నెలల పాటు మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్ 'ట్రాకర్' విభాగంలో శిక్షణ పొందిందని వివరించారు. ఆ సమయంలో మంగళగిరి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రేప్ అండ్ మర్డర్ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించినట్లు చెప్పారు. నవంబర్ 2022లో బాపట్ల జిల్లా పోలీస్ శాఖకు కేటాయించారని, ఏఆర్ కానిస్టేబుల్ యు.ఏడుకొండలు హ్యాండ్లర్‌గా వ్యవహరించారని ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, అడ్మిన్ ఆర్‌ఐ షేక్ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ అధికారులు, డాగ్ హేండ్లర్స్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన పిల్లలు



తప్పిపోయిన పిల్లలను నాయనమ్మకు అప్పగిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన పిల్లలు ఎట్టకేలకు చేరారు. గత ఏడాది నవంబర్‌లో బాపట్లకు చెందిన ఇద్దరు బాలికలు తప్పిపోవడంతో వారిని ఒంగోలులోని బాల సదనంలో ఉంచారు. ఇటీవల వారి కుటుంబ సభ్యులను గుర్తించి బుధవారం ఒంగోలులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వారిని నాయనమ్మ, బంధువులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా అప్పగించారు. తొమ్మిది నెలలుగా సామాజిక మాధ్యమాలు, పత్రికా ప్రకటనల ద్వారా అధికారులు ప్రయత్నించినా బాలికల కుటుంబ సభ్యుల ఆచూకీ లభించలేదు. దీంతో పిల్లలను తీసుకుని బాపట్ల జిల్లా ఈపూరుపాలెం, స్టువర్టుపురం ప్రాంతాలకు వెళ్లి తల్లిదండ్రులు, బంధువులను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. వారం రోజుల ప్రయత్నం తర్వాత ఎట్టకేలకు స్టువర్టుపురంలో నాయనమ్మ, ఇతర బంధువులను గుర్తించారు. బుధవారం కలెక్టర్ చేతుల మీదుగా పిల్లలను వారి బంధువులకు అప్పగించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సరంక్షణ అధికారి పి.దినేష్‌కుమార్, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు నీలిమ, సుమనశ్రీ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన

వేతనాల బిల్లు సమర్పణకు మెలిక పెడుతున్న నర్సింగ్ అధికారులు



నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు బుధవారం కూడా విధులు బహిష్కరించారు. సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ నెల 4న విడుదల చేసిన జీవో నెంబరు 115ను రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల యూనియన్ రాష్ట్ర నాయకురాలు పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి,సంధ్య, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు.

జీతాల బిల్లు కోసం తిప్పలు

జీజీహెచ్‌లో 20 రోజులుగా కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు తమ సర్వీసును రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. వారికి వేతనాల బిల్లు సమర్పించేందుకు అధికారులు మెలిక పెట్టారు. వారు లిఖిత పూర్వకంగా ఒకరోజు సెలవు పెట్టుకున్నట్లు లేఖ ఇస్తేనే వేతనాలు విడుదల చేసే బిల్లు హాజరు వివరాలు పంపిస్తామని నర్సింగ్ అధికారులు చెబుతున్నారు. దీంతో మూడు రోజులుగా కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది సంతకాల కోసం సూపరింటెండెంట్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వాస్తవానికి రోజూ అనుమతి తీసుకుని రెండు గంటలు మాత్రమే నిరసన ప్రదర్శన చేస్తున్నప్పటికీ.. ఒక్కరోజు పూర్తిగా విధులకు హాజరు కాలేదంటూ నర్సింగ్ అధికారులు తమను ఇబ్బంది పెడుతున్నారని కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు వాపోతున్నారు. ప్రతినెలా ఉండే క్యాజువల్ లీవ్స్‌లో ఒక లీవును తగ్గించి వేతనాలు మంజూరుకు హాజరు పంపిస్తే సరిపోతుందని పేర్కొంటున్నారు. ఆ విధంగా చేయకుండా లిఖిత పూర్వకంగా సంతకాల పేరుతో తమను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సుల యూనియన్ నాయకులు సైతం ఈ సమస్యలను నర్సింగ్ అధికారులతో మాట్లాడి సామరస్యంగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. మరోపక్క యూనిఫాం వేసుకుని నిరసన కార్యక్రమాలు ఆసుపత్రిలో చేయడానికి వీలు లేదని, ఆసుపత్రి ఆవరణలో టెంట్ వేయొద్దని తరచూ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులపై ఆసుపత్రి అధికారులు ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వైద్యులు సమ్మెలు చేసినప్పుడు వారికి మద్దతుగా ఆసుపత్రి అధికారులంతా ధర్నాలకు సైతం కూర్చొని సంపూర్ణ మద్దతు తెలియజేశారని, తమకు మాత్రం కనీసం నిరసన తెలిపేందుకూ ఆంక్షలు విధిస్తున్నారని బాధితులు వెల్లడించారు. తమ నిరసన ప్రభుత్వం దృష్టికి వెళ్లకపోతే సమస్య పరిష్కారం కాదని వాపోతున్నారు.

జీజీహెచ్‌కు రూ. 4 లక్షల విరాళం



డాక్టర్ కిరణ్‌కుమార్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ నేతలు

గుంటూరు మెడికల్ : ఏపీ న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ నేతలు బుధవారం గుంటూరు జీజీహెచ్‌కు రూ. 4 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆగస్టులో గుంటూరులో అసోసియేషన్ రాష్ట్ర సమావేశం విజయవంతంగా జరిగింది. అప్పటి నిర్ణయం మేరకు జీజీహెచ్ న్యూరాలజీ, న్యూరోసర్జరీ వైద్య విభాగాలకు ఈ మొత్తం ఇచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ విరాళంతో విద్యార్థుల కోసం ల్యాప్‌టాప్‌లను కొనుగోలు చేశామన్నారు. దాతలను అభినందించారు. సీనియర్ న్యూరాలజిస్టులు డాక్టర్ తారక్‌నాథ్, డాక్టర్ పమిడిముక్కల విజయలు ఆసుపత్రి అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉప్పుటూరి అరుణ కుమారి, న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ మూర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గొట్టిపాటి బిందు నర్మద, డాక్టర్ భార్గవీ దేవి, డాక్టర్ చక్కా శివరామ కృష్ణ, డాక్టర్ వీరమ్మ పాల్గొన్నారు.

స్ట్రోక్ యూనిట్‌కు ఐఎస్‌ఓ స్టాండర్డ్ సర్టిఫికెట్

అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పేద రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్న గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ విభాగంలోని స్ట్రోక్ యూనిట్‌కు ఐఎస్‌ఓ స్టాండర్డ్ సర్టిఫికేషన్ లభించింది. ఈ విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ బుధవారం మీడియాకు వెల్లడించారు.

ఇంటెలిజెన్స్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

నగరంపాలెం: ఇంటెలిజెన్స్ గుంటూరు డీఎస్పీగా కొసన సుధాకర్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు శ్యామలానగర్‌లోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టాక జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. సుధాకర్‌బాబు 1995లో ఎస్‌ఐగా చేరారు. 2010లో సీఐగా ఉద్యోగోన్నతి పొంది గుంటూరు రూరల్ ఎస్‌బీ, గుంటూరు అర్బన్ సీసీఎస్, మేడికొండూరు పీఎస్, ఇంటెలిజెన్స్, గుంటూరు రేంజ్ కార్యాలయంలో పనిచేశారు.

కొత్త సచ్చిదానందమూర్తి పేరిట పోస్టల్ కవర్ విడుదల



ఏఎన్‌యూ: ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి పేరిట ప్రత్యేక పోస్టల్ కవర్‌ను బుధవారం విడుదల చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సచ్చిదానందమూర్తి సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీస్ డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తి రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య సచ్చిదానందమూర్తి శతజయంతి ఉత్సవాలు ఏఎన్‌యూలో నిర్వహించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జన్మించిన గొప్ప తత్వవేత్త సచ్చిదానందమూర్తి అని కొనియాడారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధరరావు మాట్లాడుతూ కొత్త సచ్చిదానందమూర్తి భారతీయ తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేశారన్నారు. విజయవాడ ప్రాంతీయ పోస్ట్ మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి మాట్లాడుతూ.. ఈ ప్రత్యేక పోస్టల్ కవర్లను విడుదల చేయడం గొప్ప విషయం అన్నారు. రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపారాణి, ఆచార్య కె. వీరయ్య, ఆచార్య పి.సిద్ధయ్య, ఆచార్య ఏ ప్రమీలారాణి కూడా ప్రసంగించారు. అధ్యాపక సంఘం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ



మాట్లాడుతున్న వాణిశ్రీ

చెరుకుపల్లి: ప్రకృతి వ్యవసాయానికి రైతులు పెద్దపీట వేయాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కావూరు, ఆరుంబాక గ్రామాల్లో రైతులకు నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని ఆమె చెప్పారు. రసాయన ఎరువుల వినియోగంతో వాతావరణం కాలుష్యంతో పాటు భూమి సారాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో భూముల సారం పెరగడంతో పాటు నాణ్యమైన దిగుబడి పొందవచ్చని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంట పొలాల్ని పరిశీలించారు. సాగులో తీసుకోవాల్సిన మెళకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వాహనదారులకు నీరు కలిసిన పెట్రోలు సరఫరా

పట్టణంలోని ఓ బంకులో వెలుగు చూసిన వైనం



పెట్రోలు బంకు వద్ద వాహనదారుల ఆందోళన

రేపల్లె రూరల్: నీరు కలసిన పెట్రోలును ఓ బంకు సరఫరా చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడిన సంఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఓ పెట్రోలు బంకులో పలువురు వాహనాలలో పెట్రోలు పోయించుకుని కొంత దూరం వెళ్లేసరికి నిలిచిపోయాయి. మెకానిక్‌లు పెట్రోలులో నీరు ఉండటంతో ఈ సమస్య నెలకొందని తెలపడంతో వాహనదారులు బంకు వద్ద ఆందోళనకు దిగారు.

దీంతో యజమాని అక్కడకు చేరుకుని కంపెనీకి ఫిర్యాదు చేశారు. గురువారం వచ్చి సమస్యను పరిశీలిస్తామని కంపెనీ ప్రతినిధులు చెప్పడంతో పెట్రోలు సరఫరా నిలిపివేశారు. గతంలో కూడా ఇదే బంక్‌లో పెట్రోలు బదులు నీరు సరఫరా అయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. సమాచారం తెలుసుకున్న ఆర్‌ఐ రాంబాబు బంకులో తనిఖీలు నిర్వహించారు.



నీరు కలిసిన పెట్రోలు

సాంఘిక శాస్త్రంలో సిలబస్ తగ్గించాలి



వెంకట కృష్ణారెడ్డిని కలసి వినతి పత్రం అందిస్తున్న ఏపీఎస్ఎస్‌టీఎఫ్ నిర్వాహకులు

భట్టిప్రోలు: నూతనంగా మారిన 10వ తరగతి సోషల్ స్టడీస్ సిలబస్‌లో పాఠ్యాంశాలు ఎక్కువగా ఉన్నందున, సిలబస్ తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక శాస్త్ర టీచర్స్ ఫోరం (ఏపీఎస్ఎస్‌టీఎఫ్)రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ కోరారు. ఈ మేరకు బుధవారం మంగళగిరిలోని రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ ఎం. వెంకట కృష్ణారెడ్డిని కలసి వినతి పత్రం అందించారు. మురళీమోహన్ మాట్లాడుతూ రోల్‌తో సంబంధం లేకుండా 9, 10 తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని, సాంఘిక శాస్త్ర దినోత్సవంగా నవంబర్ 26ను ప్రకటించాలని కోరారు. జీవో 117ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎస్‌కే షైర్ ఉన్నీసా బేగం, ఎం. శేషుబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యతాలోపంపై ఆగ్రహం


- ఏజెన్సీ నిర్వాహకులపై సమగ్ర శిక్ష ఏపీసీ మండిపాటు
- విద్యార్థుల గైర్హాజరు గురించి హెచ్‌ఎం వివరణపై అసంతృప్తి



ఏజెన్సీ నిర్వాహకులకు హెచ్చరిస్తున్న ఏపీసీ జి.విజయలక్ష్మి

ప్రత్తిపాడు: పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకపోవడంపై సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ భోజనం తినని విద్యార్థుల ట్యాబ్‌లు రిటర్న్ తీసుకోవాలని కూడా హెచ్‌ఎంను ఆదేశించారు. మండల పరిధిలోని చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును బుధవారం ఏపీసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యత, రుచి లోపించడంతో ఏజెన్సీ నిర్వాహకురాలు కుమారిని ప్రశ్నించారు. కూర చేశామంటే చేశామన్నట్లుగా ఉండకూడదన్నారు. గుజ్జు కోసం కూర మొత్తంలో శనగపిండి కలపడం సరికాదని పేర్కొన్నారు. భోజనం, కూరలు వండే పద్ధతి మార్చుకోవాలని స్పష్టం చేశారు. మరో రెండు సార్లు వస్తానని, నాణ్యత ఇలానే ఉంటే ఏజెన్సీని మారుస్తామని హెచ్చరించారు. భోజనం, కూరలు ఇలా వండుతుంటే ఏం చేస్తున్నారని హెచ్‌ఎం విజయ్‌కుమార్‌ను ప్రశ్నించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. మొత్తం 205 మంది విద్యార్థులకుగాను 170 మంది వచ్చారు. దీనిపై హెచ్‌ఎంను ప్రశ్నించారు. గైర్హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేశారా..? అని అడిగారు. చేయలేదని హెచ్‌ఎం సమాధానమిచ్చారు. దీంతో అసహనానికి గురైన ఏపీసీ.. జిల్లాలో విద్యార్థుల హాజరు 40 శాతం మాత్రమే ఉంటోందని గుర్తుచేశారు. గైర్హాజరయ్యే విద్యార్థుల శాతంలో విశాఖపట్నం తర్వాత రెండో స్థానంలో గుంటూరు జిల్లా ఉందన్నారు. దీంతో కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు రివ్యూ చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు గైర్హాజరవ్వకుండా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంను ఆదేశించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను క్షేత్రస్థాయిలో హెచ్‌ఎంలకు చెప్పడం లేదా అంటూ ఎంఈవోలు రమాదేవి, లీలారాణిలను ప్రశ్నించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కొందరు మధ్యాహ్న భోజనం తినడం లేదని చెప్పడంతో తినని వారి ట్యాబ్‌లను వెనక్కి తీసుకోవాలని ఏపీసీ ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లేకపోవడం వల్లే విద్యార్థులు తినడం లేదని వారి తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. భోజనంలో నాణ్యత పెంచితే తమ పిల్లలకు తినడానికి సమస్య ఏముంటుందని చెబుతున్నారు. ఏపీసీ ఈ విషయం గమనించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం



కొండేపాడులో పత్తి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న డి.వెంకటేశ్వర్లు

ప్రత్తిపాడు: రైతాంగ సమస్యల పరిష్కారంతోపాటు వ్యవసాయంలో వస్తున్న మార్పులను వారికి తెలియజేయడమే లక్ష్యంగా పొలం బాట చేపట్టినట్లు వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం డీడీఏ డి.వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని కొండేపాడు, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కొండేపాడులో కార్యక్రమాన్ని డీడీఏ పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటల సాగు, ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యల తీవ్రతను బట్టి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గంగాభవాని మాట్లాడుతూ.. రైతులు అధిక సాంద్రత గల పత్తి మొక్కలను నాటాలన్నారు. తక్కువ వ్యవధిలో అధిక దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. వీరికి రూ. 5 వేల ప్రోత్సాహక నగదును అందిస్తున్నామని వివరించారు. ఏవో అరుణకుమారి, పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: సీజనల్ వ్యాధులపై గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల ఎస్‌పీఎం వైద్యులతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి బుధవారం సమావేశం నిర్వహించారు. గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఏ సీతారామ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తేజ్ కుమార్, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ సుగుణ రాజు హాజరయ్యారు. డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఎస్‌పీఎం వైద్యులతో రాపిడ్ రెస్పాన్స్ టీములు ఏర్పాటు చేస్తామన్నారు. వీటితో తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండల పరిధిలోని గ్రామాల్లో ఎపిడమియలాజికల్ సర్వే నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, తాజా ఆహారాన్ని భుజించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. అనారోగ్యానికి గురైతే సమీపంలోని ప్రభుత్వ వైద్య సిబ్బంది, ఆస్పత్రి వద్దకు వెళ్లాలని సూచించారు. సర్వేకు ప్రజలు సహకరించి, సేవలను వినియోగించుకోవాలని కోరారు.